క్లుప్తంగా

కేజీబీవీల్లో సీట్లను పెంచాలి



మాట్లాడుతున్న వీవీ నాయుడు

కర్నూలు(సెంట్రల్) : కస్తూరిబా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థినికి సీటు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని రాయలసీమ యువజన, విద్యార్థి సంఘాల సమితి అధ్యక్షుడు వీవీనాయుడు, కార్యదర్శి సీమకృష్ణ డిమాండ్ చేశారు. అవసరమైతే సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు. శనివారం బిర్లా కంపౌండ్‌లో వారు సమావేశమై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులను కస్తూరిబాలో చేర్పించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా వాటిలో సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయరాం, వసంత్, చరణ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను ఆమె క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలు పార్లమెంట్ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. వారి వెంట టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

వైద్య విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దృష్టి ఎప్పుడూ చదువుపైనే కేంద్రీకరించాలని మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వర రావు చెప్పారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చర్ గ్యాలరీలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం విద్యార్థులకు మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువకుల్లో మాదక ద్రవ్య దుర్వినియోగం, ఆత్మహత్యల ధోరణులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ మనస్సు చంచలమైనదని, దానిని ఎప్పుడూ నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. వైద్య విద్యార్థులు ఒత్తిడి నిర్వహణ, సమయపాలన పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు గూగుల్ ఫారమ్‌లో సాధారణ ఆరోగ్య ప్రశ్నాపత్రాన్ని అందించడం ద్వారా వారి మానసిక స్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధీర్, ఫార్మకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ రాజేష్, సైకియాట్రిస్టులు డాక్టర్ గంగాధర్‌నాయక్, డాక్టర్ యతిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలియజేయండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులు ఎటువంటి సమస్య ఉన్నా...తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఎంపీని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఎంపీని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, కర్నూలు నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : ఎల్లార్తి దర్గా ఈఓ అబ్దుల్ రెహమాన్‌పై దాడి చేసిన బోయ మల్లికార్జునపై చర్యలు తీసుకోవాలని అవాజ్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ అబ్దుల్ సుభాన్, ఎస్ఎండీ షరీఫ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసుల సమక్షంలో వృత్తి నిర్వహణలో ఉన్న ఈఓపై దౌర్జన్యం చేసి దాడి చేయడం అన్యాయమన్నారు. వెంటనే అతడిని అరెస్టు చేయాలని కోరారు.

బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

కర్నూలు (అర్బన్) : బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ కోరారు. శనివారం మిత్రమండలి ఆధ్వర్యంలో పలువురు బ్రాహ్మణ నేతలు మంత్రి టీజీ భరత్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకురావాలన్నారు. అలాగే కర్నూలు జిల్లాలో ఉన్న వనరులకు అనుగుణంగా కొత్త పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మంత్రిని కలసిన వారిలో బ్రాహ్మణ నేతలు టి.వి.రవిచంద్ర శర్మ, సముద్రాల శ్రీధర్, బి.ఎస్.ప్రసాదరావు, శ్రీనివాసరాజు, హరిశర్మ ఉన్నారు.

రింగ్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- నగరాన్ని రియల్ స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుదాం
- నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించండి
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి
- నగరపాలక అధికారులతో సమావేశంలో మంత్రి టీజీ భరత్



మున్సిపల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): 2014 సంవత్సరంలో నిలిచిపోయిన రింగ్ రోడ్డు ప్రతిపాదనలను మళ్లీ సిద్ధ చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారానే కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చన్నారు. శనివారం స్థానిక న్యూ కౌన్సిల్ హాలులో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో మంత్రి టీజీ భరత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సుంకేసుల రోడ్డు నుంచి 100 అడుగుల రోడ్డు నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు చేశారన్నారు. 2 కిలో మీటర్ల వరకు పనులు పూర్తి చేశారన్నారు. అక్కడి నుంచి ప్రకాష్‌నగర్, రోజావీధి, సంకల్‌బాగ్, సాయిబాబా సంజీవయ్య నగర్, కొత్తపేట మీదుగా ఖండేరి, రాంబోట్ల దేవాలయం వరకు రహదారి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. తద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చన్నారు. ఈ నేపథ్యంలో మధ్యలో ఆగిన పనులు మళ్లీ కొనసాగించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అలాగే కర్నూలు నగరాన్ని రియల్ స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగరంలో పైపులైన్ల లీకేజీ, నీటి ఎద్దడి సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. అలాగే నగరంలో నీటి సమస్య పరిష్కారానికి అమృత్-2లో ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు, చెక్‌డ్యాం, సుంకేసుల నుంచి డబుల్ పైపులైన్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిమాణాన్ని పెంచుకోవడం తదితర వాటిపై పూర్తి స్థాయిలో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు.

పూడిక తొలగించాలి

'నగరంలో కొద్దిపాటి వర్షానికే పాతబస్తీ , బుధవారపేట వంటి అనేక ప్రాంతాలు జలమయమవుతున్నాయన్నారు. హంద్రీ నదిలో పేరుకుపోయిన పూడిక వల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని, దీని ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ముఖ్యంగా నగరంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. రహదారుల విస్తరణ చేపట్టాలని, అయితే వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించి చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణ కాకుండా చూడాలన్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా నగరంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, పరిష్కారానికి తమ ఫ్యాక్టరీ నుంచి ఉచితంగా హైపో ద్రావణాన్ని అందిస్తామన్నారు. అలాగే టిడ్కోలో అర్హులకు ఇళ్లు కేటాయించాలన్నారు. వర్షాకాలంలో పెద్ద ఎత్తున్న చెట్లు నాటి కర్నూలులో పచ్చదనం పెంచాలన్నారు. ఈనెల 17 న బక్రీదు పండుగ సందర్భంగా అన్ని ఈద్గాల వద్ద పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. అంతకు ముందు నగరపాలకలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమృత్-2లో కొత్తగా ప్రతిపాదించిన పనులు, స్ట్రీట్ లైటింగ్, తాగునీటి సరఫరా, వివిధ విభాగాల పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మంత్రి టీజీ భరత్‌కు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల నాయకులు మంత్రి టీజీ భరత్‌ను కోరారు. శనివారం స్థానిక నగరపాలక న్యూ కౌన్సిల్ హాలులో మంత్రిని జర్నలిస్టులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఆ జర్నలిస్టులు రామస్వామి, మధుసూదన్ రెడ్డి, ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలన్నారు. అక్రిడేషన్ లేకున్నా గుర్తింపు ఉన్న జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. అలాగే ప్రెస్‌క్లబ్ నిర్మాణం చేపట్టాలని, జర్నలిస్టులకు రైల్వే పాస్‌లను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రవీణ్ కుమార్



ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరంలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రవీణ్ కుమార్

కర్నూలు (సిటీ): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడ్జూరు సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓపీకి వచ్చిన రోగులందరికీ అవసరమైన రక్తపరీక్షలు, మందులు అందించాలని తెలిపారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు జరిగిన రోగులను సందర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అందులో రక్తహీనత కలిగిన వారికి చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా ఏఎన్ఎం, ఆశాలు అంగన్‌వాడీ పరిధిలో 5 సంవత్సరాలలోపు పిల్లల గృహ సందర్శనలు చేసి అతిసారా (డయేరియా) లక్షణాలు ఉన్న వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అన్నీ సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి వారం క్రమం తప్పకుండా ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి ఇంట్లోని నీటి తొట్టెల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచి ఎండకు పెట్టుకున్నాక వినియోగించేలా చూడాలని సూచించారు. ఏఎన్ఎం, ఆశాలు పంచాయతీ సెక్రటరీ, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయించాలన్నారు. అనంతరం టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులను తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. ముఖ్యంగా ఎంఆర్1, ఎంఆర్2 వ్యాక్సిన్లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి విజయ మాధురి, డీసీఎం ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

అన్న క్యాంటీన్లకు స్థలాలను గుర్తించండి



కలెక్టరేట్ ప్రాంగణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలో త్వరలో ప్రారంభించనున్న అన్న క్యాంటీన్లకు అవసరమైన స్థలాలను గుర్తించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం, కర్నూలు ప్రభుత్వాసుపత్రి, సెట్కూరు కార్యాలయం, పరిమళనగర్ తదితర ప్రాంతాలను నగరపాలక ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 2014 సంవత్సరంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లతో పాటు మరికొన్ని కొత్తగా ప్రారంభించేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఈఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కలసిమెలసి పండుగలు జరుపుకోవాలి

కర్నూలు: హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలుగుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని కర్నూలు ఎస్‌బీఐ కాలనీలో ఉన్న కేఎంసీ కౌన్సిల్ హాల్‌లో శనివారం మత పెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కర్నూలు మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కేఎంసీ హెల్త్ ఆఫీసర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గోవధ చట్ట విరుద్ధమని, ఎవరు కూడా గోవులను వధించడం కానీ, అక్రమంగా రవాణా చేయరాదన్నారు. పోలీసు ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట పరిధిలో చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ పవన్‌కుమార్‌తో పాటు ఎస్‌ఐలు, హిందూ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

విన్నపం

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థలో విస్తరిస్తున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎస్ఎండీ షరీఫ్ మునిసిపల్ కమిషనర్‌ను కోరారు. శనివారం పాతబస్తీలో పేరుకుపోయిన చెత్తను వారు పరిశీలించారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కనిపిస్తున్నాయని, వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లకు అవకాశమివ్వాలి

కర్నూలు కల్చరల్ : ఆర్‌టీఈ యాక్ట్ 2009 కింద ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశమివ్వాలని కోరుతూ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శనివారం డీఈఓ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్‌టీఈ యాక్ట్ కింద చాలా మంది విద్యార్థులు సెలెక్ట్ అయి సరైన సమయంలో డాక్యుమెంట్స్ సబ్‌మిట్ చేయకపోవడంతో రిజెక్ట్ చేశారని డీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. టీఎన్ఎస్ఎఫ్ కర్నూలు పార్లమెంట్ జనరల్ సెక్రటరీ బొగ్గుల ప్రవీణ్, నాయకులు వినోద్, కిరణ్ డీఈఓకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఈరోజు

రామాయణ వైశిష్ట్య ప్రవచనం

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు 'రామాయణ వైశిష్ట్యం'పై ప్రవచన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపు సాల అంకయ్య ప్రవచనం చెబుతారని, సాహితీ ప్రియులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బాలవికాస్ గురువులకు జిల్లా స్థాయి శిక్షణ

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని శ్రీ సత్యసాయి సేవా సదన్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఏపీ రాష్ట్ర పదాధికారులతో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా పదాధికారులు, కన్వీనర్లు, బాలవికాస్ గురువులకు ఓంకారం, సుప్రభాతం, జ్యోతి ధ్యానం, భజన నిర్వహణపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

చిన్మయ మిషన్‌లో బాల విహార్

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్‌లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు బాల విహార్ తరగతులను పునఃప్రారంభిస్తున్నట్లు మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావాళిలో తరగతుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంత్రిని కలసిన ఎస్పీ



మంత్రి టీజీ భరత్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఎస్పీ కృష్ణకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా నియమితులైన తర్వాత మొదటిసారిగా శుక్రవారం ఆయన కర్నూలు చేరుకున్నారు. దీంతో శనివారం ఉదయం ఎస్పీ.. టీజీ భరత్ నివాసానికి వెళ్లి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులపై వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



కర్నూలు డీఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధి బృందం

కర్నూలు : హిందువులు పూజించే గోహత్య/అక్రమ రవాణా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని విశ్వ హిందూ పరిషత్ బృందం డిమాండ్ చేసింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, సహాయ కార్యదర్శి గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, బజరంగ్‌దళ్ కన్వీనర్ తెలుగు భగీరథ, మండ్ల హరికృష్ణ, గుజరాత్ సురేష్, శివపురం నాగరాజు, సల్కాపురం బాబురావు, యశ్వంత్, రాంబాబు, చైతన్య కుమార్, లోకేష్, అభిషేక్, వెంకటేష్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం శనివారం డీఎస్పీ విజయశేఖర్‌ను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించింది. ఇప్పటికే గోవుల అక్రమ రవాణాపై మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజకు, రవాణా శాఖతో పాటు నగర పరిధిలోని అన్ని పోలీసు సర్కిళ్ల అధికారులకు వినతులు సమర్పించినట్లు పేర్కొన్నారు. 1977లోనే గోహత్య అక్రమ రవాణా చట్టం అమలులోకి వచ్చినప్పటికీ పటిష్టంగా అమలు కావడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గోవధను నిషేధించాలి

కర్నూలు(సెంట్రల్) : బక్రీదు సందర్భంగా గోవధను చట్ట ప్రకారం నిషేధించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ కోరారు. శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నీలి నరసింహ, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, భగీరథ, మండ్ల హరికృష్ణ పాల్గొన్నారు.

బాబు మాట నిలబెట్టుకున్నారు



మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

కర్నూలు : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు నాయుడు వాటి అమలుకు సంతకాలు పెట్టి మాట నిలబెట్టుకున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు బీటీ నాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, డాక్టర్ సంజీవ్‌కుమార్, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి తదితరులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డీఎస్సీకి సంబంధించిన ఫైల్‌పై మొదటి సంతకం, భూహక్కు చట్టం రద్దుకు సంబంధించి రెండవ సంతకం, సామాజిక పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతూ మూడవ సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణకు సంబంధించి ఫైల్‌పై నాల్గవ సంతకం, స్కిల్ సెన్సస్ ఫైల్‌పై ఐదవ సంతకం పెట్టి మాట నిలబెట్టుకున్నారని వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మంత్రి వర్గంలో ముగ్గురికి మంత్రి పదవులు దక్కడం కర్నూలు జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విలేకరుల సమావేశంలో సత్రం రామకృష్ణుడు, జేమ్స్, షేక్షావలి, యల్లప్ప, చిన్నమారెన్న, చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

రేపు సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకొని సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఈనెల 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పదవ తరగతి సమాధాన పత్రాలకు నిప్పు



కాలిపోతున్న సమాధాన పత్రాలు

కర్నూలు (సిటీ) : స్థాని బి.క్యాంప్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన పదోతరగతి సమాధాన పత్రాలకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గది తాళం పగులగొట్టి ఈ ఘటనకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఆ స్కూల్ టీచర్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న డీఈఓ వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఫైర్ ఇంజన్‌తో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై డీఈఓ ఆరా తీస్తున్నారు. గదిలో ఈ ఏడాది మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల సమాధాన పత్రాలతో పాటు, ఓపెన్ స్కూల్ పరీక్షల సమాధాన పత్రాలు, పరీక్షల్లో వినియోగించుకుని స్క్రాప్ కూడా భద్రపరిచారు.అయితే, ఎవరైనా ఈ గది తాళాలు పగలగొట్టి వాటికి నిప్పు పెట్టారా లేకపోతే ఏదైనా ప్రమాదవశాత్తు సంఘటన జరిగిందా అన్నది తెలియాల్సి ఉంది. దీనిపై నిగ్గుతేల్చాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన స్థలానికి డీఈఓతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్, డీఈఓ ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, పరీక్షల విభాగం సూపరింటెండెంట్ హనుమన్న, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు.

వైద్య విద్యార్థి తేజస్‌రెడ్డికి నివాళి



వైద్య విద్యార్థి డాక్టర్ తేజస్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కర్నూలు మెడికల్ కాలేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ ఆర్. తేజస్ రెడ్డికి అధికారులు, వైద్యవిద్యార్థులు నివాళులర్పించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో సంతాపసభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ఎంతో ఉత్తమ భవిష్యత్ ఉన్న వైద్య విద్యార్థి రోడ్డు ప్రమాదంలో అకాలమరణం చెందడం బాధాకరమన్నారు. తేజస్‌రెడ్డి ఎంతో మంచి విద్యార్థి అని, ఆటలతో పాటు చదువులోనూ ఎప్పుడూ ముందుండే వారన్నారు. భవిష్యత్‌లో అతను ఎంతో ఉన్నత స్థితికి చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇలాంటి వ్యక్తిని రోడ్డు ప్రమాదం పొట్టనబెట్టుకోవడం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డుమీద వాహనంపై వెళ్తున్నప్పుడు రహదారి నిబంధనలను పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డుకు ఎడమవైపునే వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్, ఫార్మకాలజి ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్, ఎండోక్రైనాలజి హెచ్‌వోడి డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఎండీ అనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్) : సమాజంలో డప్పు కళాకారులకు సముచిత స్థానం కల్పించి ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనందబాబు అన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు జరదొడ్డి మద్దిలేటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..డప్పు కళాకారులు ఎన్నో పోరాటాలు చేసి రూ.3 వేల పెన్షన్ సాధించుకున్నారని, దానిని రూ.6 వేలకు పెంచాలని కోరారు. అంతేకాక పెన్షన్ అర్హత వయస్సును 45 ఏళ్లకు తగ్గించాలన్నారు. సంవత్సరానికి రెండు జతల బట్టలు, డప్పులు, ప్రత్యేక బీమా సదుపాయం కల్పించాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ప్రయాణ సదుపాయం కల్పించాలన్నారు. రెండు ఎకరాల పొలాన్ని సాగు చేసుకోవడానికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కరుణాకర్, నాయకులు మారయ్య, అంజి, మారేషు, చక్రపాణి పాల్గొన్నారు.

స్పోర్ట్స్

విలువిద్య క్రీడలతో ఏకాగ్రత



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా విలువిద్య క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : చిన్నారులు, పెద్దలు విలువిద్య క్రీడను నేర్చుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో విలువిద్య క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గతంలో మన జిల్లా నుంచిఅ నేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించారన్నారు. పురాణాల్లో విలువిద్యకు ఎంతో ప్రత్యేక స్థానం ఉందన్నారు. విలువిద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య మాట్లాడుతూ ప్రతిభ కనబరచి ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25 వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో విలువిద్య శిక్షకులు వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

23న హాకీ పురుషుల జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 23 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సీనియర్ హాకీ క్రీడాంశంలో పురుషుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ సంఘం కార్యదర్శి సుధీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1995 సంవత్సరం జనవరి 1 వ తేదీ తరువాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 27 నుంచి 30 వరకు ధర్మవరంలో నిర్వహించనున్న 14 వ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. వివరాలకు 9966565317 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.